సాక్షి శ్రీకాకుళం

బుధవారం : 26 : జూన్ : 2024



కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

జలుమూరు మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

- 8లో



జాగ్రత్తలు తప్పనిసరి

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి.

- 8లో

వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అనూరాధ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అనూరాధను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బిడ్డిక అడ్డయ్య రెక్టార్‌గా నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

4న నీలమణిదుర్గ ఆలయంలో తలనీలాల వేలం

పాతపట్నం : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో జూలై 4న మధ్యాహ్నం మూడు గంటలకు తలనీలాల బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈవో టి.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 జూలై 13 నుంచి 2024 జూలై 3 వరకు అమ్మవారికి సమర్పించిన తలనీలాలకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పైనాపిల్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గిరిజన యువతకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎక్కువగా లభ్యమయ్యే పైనాపిల్ పండ్లతో స్క్వాష్ జామ్ వంటి ఉత్పత్తులు తయారు చేయవచ్చన్నారు. వీటి ద్వారా ఆర్థికాభ్యున్నతి సాధించవచ్చన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వెలుగు అసోసియేషన్ సంస్థ, ఆదివాసీ రైతు ప్రగతి గ్రూపు తరఫున 20 మంది శిక్షణ పొందారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష ,డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలుడికి రక్తదానం



బ్లడ్ ప్యాకెట్ అందజేస్తున్న అభయం యువజన సేవా సంఘం ప్రతినిధి శ్రీనివాస్

టెక్కలి : టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ అనాథ బాలుడికి పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం అండగా నిలిచింది. కాశీబుగ్గకు చెందిన గొల్లూరు రాజేష్ అనే ఆరేళ్ల బాలుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అత్తయ్య మోహిని వద్ద ఉంటున్నాడు. ఇటీవల ఆడుకుంటూ పడిపోవడంతో కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. అత్యవసరంగా ఏ-పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ సకాలంలో స్పందించి అవసరమైన రక్తాన్ని సమకూర్చారు.

ప్రాణాలతో 'సెల్'గాటం!



ట్రాఫిక్ నిబంధనలను కొందరు ద్విచక్ర వాహనచోదకులు బేఖాతరు చేస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో పాటు ఇలా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసినా జరిమానా తప్పదని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కొందరు ద్విచక్ర వాహనచోదకులు ఇలా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

సాగుకు ముందు.. సాయమేదీ?

- పీఎం కిసాన్ జమైనా కానరాని రైతు భరోసా
- పంట పెట్టుబడి కోసం అన్నదాతల ఎదురుచూపు
- విడుదల కాని రాష్ట్ర ప్రభుత్వం నిధులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా జూన్ 10లోపే జమ
- ఏటా 3.22 లక్షల మందికిగాను ఐదేళ్లలో రూ.1984 కోట్లు విడుదల



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

రైతు భరోసా సాయం కోసం అన్నదాతలు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతు భరోసాకు సంబంధించి ఎటువంటి ప్రకటన చేయలేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతలకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు.. నేటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంట పెట్టుబడులకు ఉపయోగపడే ఈ సాయాన్ని ఖరీఫ్ సీజన్‌లోపు అందిస్తేనే తమకు మేలు జరుగుతుందని పలువురు చెబుతున్నారు.

నాడు ఠంఛన్‌గా జమ..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బందిపడకుండా గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లింది. సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి మొత్తంగా రూ.13,500 చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేసింది. జిల్లాలో 3.22లక్షల మంది రైతులుండగా ఐదేళ్ల వ్యవధిలో రూ.1983.73 కోట్ల లబ్ధి చేకూర్చింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు అందిన లబ్ధి ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	2.58లక్షలు	348.50
2020–21	2.91 లక్షలు	393.52
2021–22	3.07లక్షలు	414.57
2022–23	3.10లక్షలు	393.14
2023–24	3.21లక్షలు	434కోట్లు

మూడు విడతల్లో జమ..

గత జగనన్న ప్రభుత్వం ఖరీఫ్ పంట వేసేముందు ఏటా సరిగ్గా మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 విడుదల చేసేది. తర్వాత అక్టోబర్‌లో ఖరీఫ్ పంట కోతతో పాటు రబీ సాగు అవసరాల కోసం రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చేది. ఆ తర్వాత జనవరిలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు.. ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ ద్వారా మొత్తం రూ.13,500 చొప్పున గత ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేసింది. ఏటా సకాలంలో రైతులను ఆదుకుంటూ వచ్చింది. రైతు భరోసా పథకంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ...ఇలా అనేక పథకాల ద్వారా గత ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

ఆదేశాలు వచ్చాకే..



నూతనంగా ప్రభుత్వం ఏర్పడటంతో రైతుభరోసా డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేసే విషయమై ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతులకు డబ్బులు జమ చేసి ఖరీఫ్ పనులకు అండగా నిలుస్తాం. ప్రస్తుతం పీఎం కిసాన్ డబ్బులు జమ చేశాం. – కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

రైతన్నల ఎదురుచూపు..

తాను అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేల చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేస్తానని ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఖరీఫ్ సాగుకు కేంద్రం నిధులు విడుదల చేయడంతో రైతులంతా రాష్ట్ర ప్రభుత్వం వాటా కోసం ఎదురుచూస్తున్నారు. ఏటా ఇవ్వాల్సిన రూ.20వేలులో మొదటి విడతగా ఎంత ఇస్తారో కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతాంగమంతా ఖరీఫ్‌కు ముందే తమ ఖాతాల్లో డబ్బులు వేసి గత ప్రభుత్వంలాగే ఆదుకోవాలని కోరుతున్నారు.



విద్యారంగంలో మార్పులు తప్పనిసరి

- అంబేడ్కర్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ రజిని



వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. ఎచ్చెర్లలో మంగళవారం వర్సిటీ 17వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సెమినార్ హాల్లో నిర్వహించిన వ్యవస్థాపక వేడుకల సభలో మాట్లాడారు. వర్సిటీలో ప్రస్తుతం అనేక సవాళ్లు ఉన్నాయని, రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా చెప్పారు. అయినా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను సైతం ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అన్ని కోర్సులు బలోపేతం చేయడం, నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధించడంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య మాట్లాడుతూ వర్సిటీ కోసం రెండు దశాబ్దాలు ప్రజా సంఘాలు, మేధావులు పోరాటం చేసిన అంశాన్ని గుర్తు చేశారు. 2008 జూన్ 25న జిల్లాలో విశ్వవిద్యాలయం అవసరం గుర్తించి వర్సిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో వర్సిటీ ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మాట్లాడుతూ సీనియర్ విశ్వవిద్యాలయాలతో పోటీపడి విద్యనందిస్తుందన్నారు. అనంతరం వసతి గృహం సిబ్బందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కె.స్వప్నవాహిణి, డాక్టర్ యు.కావ్య జ్యోత్స్న, చీఫ్ వార్డెన్ ఎన్.లోకేశ్వరి, పాలక మండలి సభ్యులు కె.మాధవి, కె.చక్రవతి పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాల రవాణాపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : నిషేధిత పదార్థాలను సాధారణ వస్తువుల మాదిరిగా ప్యాకింగ్ చేసి రవాణా చేసేందుకు ప్రయత్నించేవారి వివరాలు తెలిస్తే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు తెలియజేయాలని సెబ్ ఈఎస్ తిరుపతినాయుడు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెబ్ అదనపు ఎస్పీ (జేడీ) డి.గంగాధరం ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని న్యూకాలనీలో ఉన్న సెబ్ స్టేషన్‌లో మంగళవారం పార్సిల్, ట్రాన్స్‌పోర్ట్, ట్రావెల్స్ బుకింగ్ సెంటర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని, కస్టమర్ మొబైల్ నంబర్, డెస్టినేషన్ పాయింట్ మొబైల్ నంబర్ విధిగా తీసుకోవాలన్నారు. పార్సిల్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రవాణాకు అనుమతించాలని స్పష్టం చేశారు. నిషేధిత పదార్థాల జాబితా బోర్డును కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఏఈఎస్ ఎం.వినీషా, సీఐ ఎం.వి.గోపాలకృష్ణ, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా స్టూడెంట్ కిట్ల పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అందజేస్తున్న స్టూడెంట్ కిట్లను పకడ్బందీగా పంపిణీ చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ(విశాఖపట్నం) బి.విజయభాస్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ కార్యాలయంలో మంగళవారం ఉప విద్యాశాఖాధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శతశాతం ఉండేలా చూడాలన్నారు. పీఎం–పోషన్ గోరుముద్ద పేరిట అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. టీచర్ల ఖాళీ వివరాలను స్పష్టంగా తెలియజేయాలన్నాన్నారు. సమావేశంలో డీఈఓ కె.వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, డీవైఈవోలు ఆర్.విజయకుమారి, విలియమ్స్ ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- ఇంటి పేరు చిట్టి

నటనలో ఘనాపాటి



శ్రీకాకుళం కల్చరల్

- నటనలో రాణిస్తున్న చిట్టి వెంకటరావు
- 47 ఏళ్లుగా హాస్యనటుడిగా గుర్తింపు
- నాటకాలు, నాటికల్లో అద్భుత ప్రదర్శనలు



తిరుపతిలో అశ్వం అవార్డు అందుకుంటున్న వెంకటరావు

చిట్టి వెంకటరావు.. నాటకరంగ అభిమానులకు పరిచయం అక్కర్లేని పేరు. 47 ఏళ్లుగా కళామతల్లి సేవలో ఉంటూ నాటకాల్లో తనదైన శైలిలో హాస్యం పండిస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. శ్రీకాకుళంలోని బాకర్‌సాహెబ్‌పేటలో నివాసముంటున్న ఈయన దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తూ అనేక సత్కారాలు, బిరుదులు పొందారు. కళాకారుడిగానే కాకుండా రంగస్థల కళాకారుల సమాఖ్యకు అధ్యక్షుడిగా, నాటక పరిషత్‌ల నిర్వాహకునిగా అనేక సేవలందిస్తున్నారు. 2019లో ఉగాది పురస్కారం, దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ వారి 'విశాఖరత్న' పురస్కారం, 2022లో ఎన్టీఆర్ స్మారక పురస్కారం, మహాబలిపురం నాట్యోత్సవంలో శివనంది అవార్డు, 2023లో బి.వి.ఆర్ కళాకేంద్రం వారి ఉగాది పురస్కారం, ఢిల్లీలో కళారత్న పురస్కారం వంటి అనేక బిరుదులు, సత్కారాలు అందుకున్నారు. తాజాగా తిరుపతిలో అశ్వం అవార్డు అందుకున్నారు.

విద్యార్థి దశ నుంచే..

వెంకటరావు చదువుకున్న రోజుల నుంచే నాటకాలపై మక్కువతో సహ విద్యార్థులతో కలిసి 'విధిరాత' నాటకంలో ఎస్‌ఐ పాత్ర ద్వారా 1976లో నాటక రంగ ప్రవేశం చేశారు. శ్రీశైనా ఆర్ట్స్‌లో చేరి రంగస్థల హాస్యనటుడిగా నాటికలు, నాటకాలు ప్రదర్శనలు ఇచ్చారు. పల్లెపడుచు, జీవన తరంగాలు, చదరంగం, మార్చి 21, రాముడు లేని రాజ్యం, జారుడు మెట్లు, ఆంధ్రకేసరి (ఆంధ్ర కేసరిగా), వీరగున్నమ్మ, పులి వేట, ఎర్రసైన్యం, జాతికి ఊపిరి స్వాతంత్ర్యం తదితర నాటకాలలో ప్రదర్శించిన నటనకు ఉత్తమ నటుడిగా, హాస్యనటుడిగా, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా బహుమతులు పొందారు.


రేడియోనాటికలు, టెలీఫిలిమ్స్‌లో సైతం..

రంగస్థలంపైనే కాకుండా ఆకాశవాణి, రేడియో నాటికలలోనూ రాణించారు. ఆరాటం, మలుపు, కనువిప్పు, హరిశ్చంద్రుడు వంటి నాటికలతో మెప్పించారు. శ్రీకాకుళ స్వర్ణోత్సవాలు, సంక్రాంతి సంబరాలు, అక్షర క్రాంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన అక్కినేని నాగేశ్వరరావు నాటక పరిషత్, పరుచూరి రఘుబాబు స్మారక నాట క కళా పరిషత్, ఢిల్లీ ఆంధ్రాభవన్‌లో ఎన్‌టీఆర్ నాటక కళాపరిషత్‌లలో నటించి పలు పురస్కారాలు అందుకున్నారు. నటుడిగా, ప్రయోక్తగా, దర్శకుడిగా, నిర్వాహకునిగా, రాష్ట్ర స్థాయి నాటక పరిషత్తులకు జడ్జిగా కూడా వ్యవహరించారు.

ఐటీఐలో 686 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ కొనసాగుతోంది మిగులు సీట్లకు మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 52 మందికి ప్రవేశాలు కల్పించారు. ఈ నెల 18 నుంచి మంగళవారం వరకు మొత్తం 686 మందికి అడ్మిషన్లు కల్పించారు. మొదటి విడత కౌన్సెలింగ్ బుధవారంతో ముగియనుంది. దరఖాస్తు చేస్తుకున్న విద్యార్థులంతా కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్ రావు కోరారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరావు పర్యవేక్షించారు.

27 నుంచి ఉచిత ధ్యాన తరగతులు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్‌లో ఈ నెల 27నుంచి 30 వరకు ఉచిత ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా టీచర్ దేసూళ సురేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్వాసకు సంబంధించిన శిక్షణతో పాటు ఒత్తిడి లేకుండా జీవించడంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 7989752675 నంబరును సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రెండు ఇసుక లారీల పట్టివేత

గార: మండల పరిధిలోని బూరవెల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నామని ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం వేకువ జామున గార–చింతాడ రోడ్డులో లారీలతో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

రక్తదాతలకు వందనం



రక్తదానం చేస్తున్న యువత

శ్రీకాకుళం అర్బన్: రక్తదాతలు ప్రాణదాతలుగా నిలవడం హర్షనీయమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం శ్రీకాకుళం నగరానికి చెందిన అల్లు అర్జున్ ఆర్మీ అండమాన్ టీం గోవింద్ రవి ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రక్తదానంలో యువత భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. గోవింద్ రవి ఇప్పటివరకు సుమారు 1400 యూనిట్ల రక్తం అందజేశారని, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించారని ప్రశంసించారు. గోవింద్ రవి మాట్లాడుతూ అండమాన్‌లో పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండా శంబుమూర్తిని స్ఫూర్తిగా తీసుకొని మిత్ర బృందం, అల్లు అర్జున్ ఆర్మీ అండమాన్ టీం సభ్యుల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొంతం సునీల్, కె.వి.వి.ఎస్.నాయుడు, పొడుగు చరణ్, ఉర్లాం శివతేజ, బ్లడ్ బ్యాంకు సిబ్బంది, రక్త దాతలు రవి, శశి, శ్రీను, గిరి, కిషోర్ పాల్గొన్నారు.


చిన్నారికి చక్రాల కుర్చీ వితరణ



చక్రాల కుర్చీ అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని దమ్మలవీధికి చెందిన మాగుపిల్లి రాము కుమారుడు ఢిల్లీశ్వరరావు రెండేళ్లుగా పోస్ ఎస్ఎస్‌పీఈ అనే వ్యాధితో బాధపడుతూ చక్రాకుర్చీకే అంకితమయ్యాడు. చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని తండ్రి వాపోయాడు. చిన్నకుమారుడు యశ్వంత్‌కు కూడా వ్యాధి సోకడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. పెద్ద కుమారుడికి మూడు చక్రాల కుర్చీ అవసమని సామాజిక సేవకుడు ఉర్లాం శివతేజను సంప్రదించగా ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్‌తో కలిసి పాలకొండ ఆర్డీఓ కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహిస్తున్న నందముడి రాంబాబు ఆర్థిక సాయంతో చక్రాల కుర్చీని సమకూర్చారు. ఆ కుర్చీని మంగళవారం కొంక్యాన వేణుగోపాల్ చేతుల మీదుగా అందచేశారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రబాబు

బూర్జ: నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ అక్షరాస్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఏపీ జీవీబీ బ్రాంచి మేనేజర్ కె.సతీష్ అన్నారు. బూర్జ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం డ్వాక్రా మహిళలు, వెలుగు సీఎఫ్‌లు, వెలుగు సీసీలు, సిబ్బందికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాక్టు మేనేజర్ వి.అశోక్‌మార్ పర్యవేక్షణలో డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.బాబూరావు, ఎంపీటీసీ పోలినాయుడు, సర్పంచ్ ఏగు అనూరాధ, ఏఎస్సై ఎం.వి.రమణ, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్ ఎ.హరనాథ్, ట్రైనర్లు యు.రాజేష్, బి.చంద్రశేఖరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



• వరుణుడి కరుణ



ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాతపట్నం మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతకు గురైన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం పొందారు.

\- పాతపట్నం

• ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీగణపతి ఆలయంలో మంగళవారం సంకష్ట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, షిరిడిసాయి సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం, సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

\- శ్రీకాకుళం కల్చరల్

• కోలాట ప్రదర్శన



నందిగాం గణేష్ కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం గణేష్‌కాలనీ చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

\- నందిగాం

పురుగు మందుల పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

బూర్జ/సరుబుజ్జిలి: పంటల సాగులో పురుగుల మందులు పిచికారీ చేసినప్పుడు రైతులు రక్షణాత్మక చర్యలు అనుసరించాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. విత్తనాలు చల్లడం మొదలు పురుగుల మందులు, రసాయన ఎరువులు వాడే సమయంలో నిపుణుల సూచనలు తప్పక పాటించాలని అంటున్నారు. పంట చేలల్లో కలుపు మొక్కల నివారణకు కొందరు విత్తనాలను వేసిన వెంటనే పురుగుమందులను పిచికారి చేస్తున్నారు. దీనితో లాభం కన్నా నష్టమే అధికంగా ఉంటుంది. మందులను అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గడంతో పాటు భూమిలో ఉన్న మేలు చేసే వానపాములు వంటి జీవులు చనిపోతున్నాయి. ప్రధానంగా రైతులు పత్తి, మొక్కజొన్న, వరి, పసుపు, పంటల్లో క్రిమి సంహారక మందులను మితిమీరి వాడుతున్నారు. అయితే ఈ మందులను ట్యాంకులో కలిపే సమయంలో, పిచికారి చేసే సమయంలో రైతులు పలు సూచనలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు.



పురుగు మందులు పిచికారి చేస్తున్న రైతు



జాగ్రత్తలు లేకుండా మందులు పిచికారీ చేస్తున్న రైతు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పురుగు మందులు పిచికారీ చేస్తున్న సమయంలో రైతులు, కూలీలు బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముఖాన్ని తాకరాదు.
- భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- మందులు పిచికారి చేసిన తర్వాత ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతుక్కోవాలి.
- విష ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.
- నాటు వైద్యుడిని సంప్రదించి ప్రాణాలమీదకు తెచ్చికోవద్దు.
- పిచికారి సమయంలో శరీరం కన్పించకుండా రక్షణ దుస్తులు ధరించాలి.
- పురుగు మందులు కలిపిన ద్రావణం డబ్బా, సీసాలను కాలువలు, చెరువులలో వేయరాదు. అందులో నీటిని వేసి తాగరాదు. వాడిన పురుగు మందు డబ్బాలను రంధ్రం చేసి దూరంగా ఉంచాలి.
- క్రిమి సంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళలలో మాత్రమే పిచికారి చేయాలి.
- గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయరాదు.

సరైన మోతాదులో..

క్రిమి సంహారక మందులను సరైన మోతాదులో వాడాలి. డోస్ ఎక్కువైతే పంటకు ఉపయోగపడే జీవులు కూడా మృత్యువాత పడే అవకాశముంది. 25 డిగ్రీలు సెంటీగ్రేడ్ వద్ద పిచికారి చేయడం ప్రయోజనకరం. పంటలకు తడి అందించిన అనంతరం ఉదయం వేళల్లో పురుగు మందు పిచికారి చేయడం ద్వారా మందు ఆవిరవుతుంది. ఆ సమయంలో పిచికారి చేయరాదు.

మాస్క్ ధరించాలి..



రైతులు క్రిమి సంహారక మందులను పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. చేతిక గ్లౌజులు, ముఖానికి మాస్క్ లేకుండా మందులను పిచికారి చేయరాదు. పంటకు సరైన మోతాదులో మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించాలి.

\- వి.రాజేశ్వరరావు, బూర్జ మండల వ్యవసాయశాఖాధికారి

మోతాదు మేరకే..



సరైన మోతాదులోనే పురుగు మందులు వాడాలి. ఎక్కువ డోస్‌లో వాడితే పంటకు ఉపయోగపడే జీవులు చనిపోతాయి. పిచికారి సమయంలో శరీరం కన్పించకుండా రక్షణ దుస్తులు ధరించాలి. విష ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

\- బి.రాజగోపాలరావు, కొత్తూరు డివిజన్ ఏడీఏ

ఆర్బీకేల ద్వారా సూచనలు



రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతుభరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లు ఏర్పాటు చేసాం. రైతులు అవగాహన పెంచుకోవాలి.

\- జె.శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ

ఆంజనేయ గుడిలో చోరీ

- కేజీన్నర వెండి ఆభరణాల అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్వామి ఉత్సవ విగ్రహానికి అలంకరించిన కేజీన్నర వెండి వస్తువులను అపహరించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తాళాలు విరగ్గొట్టి లోపల ఉన్న వెండి ఆభరణాలు, కిరీటం, గద, వెండి సంజీవని పర్వతం, వెండి పాదాలు, శఠకోపం, వెండి పళ్లెం, హారం వంటివి దొంగతనం చేశారని అర్చకుడు శివ తెలిపారు. మంగళవారం సందర్భంగా సోమవారం రాత్రి స్వామి విగ్రహానికి ఆలయంలో ఉన్న వెండి వస్తువులు అలంకరించామని, వీటన్నింటినీ దొంగలు పట్టుకుపోయారని చెప్పారు. వేకువజామున ఆలయానికి వెళ్లేసరికి తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆలయం హుండీలో ఉన్న నగదు కూడా చోరీ చేశారన్నారు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది.

ఉద్దానం అక్షర జ్యోతికి అశ్రునివాళి

- ఉపాధ్యాయుడు ఓంకార్ మృతికి ప్రజాసంఘాల నేతల సంతాపం



తండ్రి చితికి నిప్పంటిస్తున్న కుమార్తె అనుశ్రీ



బత్తిన ఓంకార్ (ఫైల్)

పలాస/కాశీబుగ్గ: ఉద్దానం అక్షరజ్యోతిగా, ప్రజా ఉద్యమకారుడిగా, డప్పు కళాకారుడిగా పేరుగాంచిన ప్రముఖ ఉపాధ్యాయుడు బత్తిన ఓంకార్(56) మంగళవారం ఉదయం మరణించారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఓంకార్‌కు ఆదివారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. వైద్య సేవలు పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈయన మృతితో ఉద్దానంలో విషాదఛాయలు అలముకున్నాయి. అతి సాధారణ కుటుంబంలో పుట్టిన ఓంకార్ వామపక్ష భావాలను విద్యార్థి దశ నుంచే అలవరుచుకున్నారు. ఆంధ్రా యూనివర్శిటీలో విద్యార్థి సంఘ నాయకుడిగా విద్యార్థుల పక్షాన నిలిచారు. ఉపాధ్యాయునిగా ఉంటూనే ఉద్దానం ప్రాంతంలో ప్రజాఉద్యమాలతో మమేకమయ్యారు. సమస్య ఏదైనా ప్రజల వైపు నిలబడి గొంతు వినిపించేవారు. డప్పు, జముకు కళాకారుడిగా గాయకుల పక్షాన నిలుచొని సహాయపడేవారు.. ఉద్దానం విద్యాభివృద్ధి వేదికలో ప్రధాన భూమిక పోషించారు. కిడ్నీ మహమ్మారి నిర్మూలనకు అనేక పోరాటాలు చేశారు. జీడి రైతుల గిట్టుబాటు ధరల కోసం చేస్తున్న పోరాటంలో తన వృత్తిని సైతం పక్కన పెట్టి నిలిచారు. యు.టి.ఎఫ్ సంఘంలో ఉంటూ ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తారు. ఈయన మరణవార్త తెలిసి అనేక ప్రజాసంఘాల నాయకులు మాకన్నపల్లి తరలివచ్చారు. జీఎస్‌టీ మాజీ కమిషనర్ జుత్తు తాతారావు, డాక్టరు తెప్పల ఆనందరావు, జీడి రైతాంగ పోరాట కమిటీ అధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్, ప్రజాకవి కుత్తుం వినోద్, యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, ఎల్.వి.చలం, కె.మోహనరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, యు.వి.వి అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, మహిళా సంఘం నాయకులు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమ తదితరులు నివాళులు అర్పించారు. కాగా, ఓంకార్ ఏకైక కుమార్తె అనుశ్రీ తన తండ్రి చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తి చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు గనగళ్ల మోహన్‌దాస్ దత్తా, రామారావు శ్రీకాకుళంలో పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరికీ గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ క్లీనర్‌కు..

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని మంగళవారం విశాఖపట్నం వైపు వెళ్తున్న మరో లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో ఉన్న లారీ క్లీనర్ కనకరాజు గాయపడ్డారు. ఈయన స్వస్థలం భీమిలి. క్షతగాత్రుడు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు పునరుద్ధరించాలి



ఉప్పుశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

సంతబొమ్మాళి: ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే ఉప్పు ఉత్పత్తిదారుల లీజులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పీరుపల్లి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప్పు పరిశ్రమశాఖ కమిషనర్ ప్రేరణ జోషికి కాకినాడలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. 2013 నుంచి ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు నిలిచిపోవడంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, దీంతో లైసెన్సుదారులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. లీజులు పునరుద్ధరించడంతో పాటు అసైన్మెంట్ ఫీజులు తగ్గించాలని కోరారు. టెండర్ విధానంలో ఉప్పు భూములు అప్పగించాలని విన్నవించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదని, రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే లీజులు పునరుద్ధరణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మాచారావు, మల్లికార్జునరావు, బుజ్జిబాబు, సంతోష్ కుమార్, నౌపడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ స్టాల్ట్ షేక్ ముజ్రేల్ ఇస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో కంచిలి విద్యార్థుల ప్రతిభ



నర్తు రామ్‌రన్వీర్



నల్లాన వెనీషా



బద్రి శివాని



లక్ష్మీనారాయణ పాయికో



కంబాల మహిత్‌రెడ్డి

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇండియన్ స్కూల్ ఆఫ్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్(2023–24) ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు రెల్ల కామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతికి చెందిన నర్తు రామ్‌రన్వీర్ స్వర్ణ పతకం, రూ.1500 నగదు, లక్ష్మీనారాయణ పాయికో రజతం, కంబాల మహిత్‌రెడ్డి కాంస్యం, 3వ తరగతికి చెందిన నల్లాన వెనీషా స్వర్ణం, 2వ తరగతికి చెందిన బద్రి శివాని స్వర్ణ పతకం సాధించినట్లు వివరించారు. వీరికి గైడ్ టీచర్‌గా నల్లాన రవి వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



ఘటనా స్థలంలో సింహాచలం మృతదేహం



ప్రమాదానికి కారణమైన కారు

జలుమూరు: మండలంలోని జోనంకి పంచాయతీ అబ్బాయిపేట జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణ గ్రామానికి చెందిన వాన సింహాచలం(70) తలతరియా లింగాలుపాడులోని తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అబ్బాయిపేట జంక్షన్ మలుపు వద్దకు వచ్చేసరికి పాతపట్నం నుంచి నరసన్నపేట వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారులు లింగమూర్తి, గోపాలరావు, కుమార్తె జ్యోతి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. చిన్నకుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(జీడీసీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆన్‌డ్యూటీ(ఓడి)పై ఆమెను వీరఘట్టం ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ట్రాన్స్‌ఫర్ చేసింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ కె.సూర్యచంద్రరావుకు జీడీసీ మెన్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఆరోపణల నేపథ్యంలో..

ప్రిన్సిపాల్ సురేఖపై వచ్చిన వివిధ ఆరోపణలు యదార్థమని నిరూపితమైనందున ఆమెను ఓడీపై బదిలీ చేస్తున్నట్టు కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆర్సీ నెంబర్ 19/ఓపి.1/2023(తేదీ 24-06-2024) ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులతో పాటు ఆర్జేడీ రాజమండ్రి, విశాఖపట్నం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇచ్చిన రిపోర్టులు, సీసీఈ ఇచ్చిన ఉత్తర్వులు, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది జీతభత్యాలు చెల్లింపుల్లో అలసత్వం, కళాశాలలో సహృద్భావ వాతావరణం దెబ్బతీయడం, కళాశాల పవిత్రతను దెబ్బతీసేలా కార్యక్రమాలు చేపట్టడం వంటి కారణాలను ఆధారంగా చూపిస్తూ బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.